ఏ క వీ ర

విశ్వనాథ సత్యనారాయణ గారు, యమ్. ఏ.

[ఒకమాట-ఇందు, మధురనాయకులు, కుట్టాక్, డినోబిలి వీరు చరిత్రలోని పురుషులు. ఊళ్ల పేరులు సంఘస్థితి ఆనాటిది. 'Nayak Kings of Madura' and 'Aravidu Dynastty' ఈ రెండు పుస్తకములు దీనిలోని చరిత్రాంశములకు నాకాధారభూతములు. ప్రేమసంబంధమైన తక్కినకథయంతయు కల్పితము. ఏకవీరాదేవి త్వగింద్రియము యొక్క స్పర్శగుణములోని మహాకోమలత్వము, స్వచ్ఛత్వము, ఒకానొక విశిష్టమైన గుణము నీ చిన్నిగ్రంథములోని యుద్దిష్టార్థములు. ఇందు చరిత్రాంశములు, చరిత్రేతరాంశములు నతుకుట పనిగా పెట్టుకోబడినది. ఈ రెండు విడిగా చూచిన జరిత్రాంశములు విడిగా గనబడును.]

౧

అది వేసగి. వైగై నది కృశించి ప్రోషితభర్తృకవలె సన్నగిల్లినది. ఈనది పుట్టుకకు కారణముగా మధురానగరమున సేవించియున్న శ్రీ మీనాక్షీ సుందరేశ్వరుల వివాహమునకు సంబంధించిన యొక్క కథయున్నది. మీనాక్షీదేవి పాండ్యరాజు కొమరిత; పార్వతీదేవి యవతారము. ఆమె పుట్టిననాటినుండి లోకనాయకుడును, నాదిభిక్షువు నగు శ్రీ సుందరేశ్వరునే వరించియున్నది. ఆమె బుద్ధి మరలించుటకు శక్యము కాక రాజుకూడ నామెను సుందరేశ్వరున కిచ్చుటకు సమ్మతించెను. ఆమె యన్నగారి కిష్టమే లేదు వివాహమునకు శ్రీ సుందరేశ్వరులు తరలి వచ్చినారు. పరివారము లేదు; బందుగులు లేరు. ఆదిభిక్షువు తానొక్కడే వచ్చినాడు. తనకు తగినట్లుగా నెంతయో పెద్దగా వివాహప్రయత్నము చేసిన పాండ్యరాజు నిస్సారపడిపోయినాడు. చేసిన ప్రయత్నములు చూపి, తెచ్చినపదార్థములు చూపి యివన్నియు నేమికావలెనని యల్లుని నిందించినాడు. పరమేశ్వరుడు నవ్వి తన వెంట గొనివచ్చిన యొక కుబ్జవానిని చూపి యీ పదార్థము లన్నియు నాకుబ్జుడు భుజించునన్నాడు. అతడొక రాక్షసుడు. అతని పేరు కుండోదరుడు. అతనిలో భగవంతుడు క్షుధాగ్నిసహస్ర ముఖంబులుగ ప్రజ్వలింపజేసినాడు. కుండోదరుడు సకలపదార్థములు నారగించి దాహమని యరచినాడు. మధురలోని బావులు చెరువులు చాల లేదు. కుండోదరుని చేయి పట్టుమని పరమేశ్వరుడు తన శిరోభాగమున భాగీరథీ మహాప్రవాహము నడ్డగించు జటాసమూహములో నొక జట సడలించినాడు. ఆరీతిగా పరమేశ్వర జటావివరాగ్రవినిస్సృతయగు గంగానది మధురాసమీపమున వైగై నదియై

ప్రవహించినది. పర్వతాగ్రముల నుండి ప్రవహించు సెలయేటివలె వైఁగై మిగుల తొందరకత్తె. వైఁగై యనగా ద్రావిడభాషలో 'చేయిపట్టుము' అని యర్థము.

ఆనాడు కుండోదరుని దాహము కొన్ని బిందువులతో మాత్రము తీర్చిన యాపుణ్యనది నేడు వేసగి కాకలకు సగమైపోయినది. వైఁగై మధురాపురి కొకదిక్కున కందకమువలె నైనదే. తక్కిన మూఁడువైపుల కోటగోడయు, గందకము నున్నవి. నది నిండుగా ప్రవహించునపుడు చిన్నయోడలు నదిలో తిరుగుచునే యుండును. కొంతవర కానదిపైన వర్తకముకూడ జరుగుచుండును. ఇపుడు నది క్షీణించి యుండుటచేత చిన్నిచిన్ని పడవలు నది యిసుకతిన్నెలమీఁద నందందు వదలిపెట్టబడి యున్నవి.

వైఁగై చిన్నపాయగా కొబ్బరి నీళ్లవలె తళతళలాడుచు ప్రవహించుచున్నది. నదికి దిగువ భాగమున నొకపెద్దగుండ మున్నది. అది వేసంగిలోఁగూడ మిక్కిలి లోతుగానే యుండును. ఆగుండములోననే యేనుగులను కడుగుదురు. ఈ గుండమునకు పైగా నొకచోట నదిలోననే యొక చిన్నచెఱువువలె నొక గుంట యేర్పడియున్నది. రాజాంతఃపురములకు నిత్యమును మంచినీర మీగుంటనుండి మహిషరాజములమీఁద తోలుతిత్తులతో తీసికొని పోవుచుందురు. ఇంకను నెగువ వర్షర్తువులో పడవలు నిలుచుచోటు. అంతకుపైనపట్టణమునకు చివరిభాగమున నిసుకతిన్నెలు మొగలి పుష్పాళ్లు చల్లి సిద్ధముచేసిన విశ్రాంతిస్థలమువలె నుండును. అచ్చటికి సాయంకాలములయందు పట్టణమునుండి విద్యార్థులు, రాజకుమారులు, పండితులు వచ్చి విశ్రమింతురు. సాంధ్యకాలములయందు విద్యార్థులు సంధ్యావందనములు చేసి శాస్త్రప్రసంగములు చేయుచుందురు. రాచకొడుకులు, వయసుపోకిళ్ల బిరుదుమగలు తమయశ్వారోహణ విద్యావైశద్యము చూపుచుందురు. కొంచెము ప్రొద్దుపోయినంతట నేయ్యందఱును పురప్రవేశము చేయవలయును. నిశాభాగ మెల్లను నాచోట రక్షకభటులు కృపాణపాణులై తిరుగుచుందురు జాముప్రొద్దుపోయిన వెంటనే కోటతలుపులు మూసెదరు. తరువాత నొక ప్రాణి లోనుంచి బయటకుగాని, బయటనుంచి లోనికిగాని పోవుటకు వీలులేదు.

ఆనాడు కృష్ణచతుర్థి. సందె చీకటి. కొంచెము చీకటి పడువరకు వైఁగై నదీసికతాతలములన్నియు నిశ్శబ్దములు, నిర్మానుష్యములు నయ్యెను. కాని దూరమున విశ్రాంతిస్థలములైన యిసుకతిన్నెలమీఁద నిద్దరు మాత్రము కూర్చుండి మాటలాడుచుండిరి.

'వీరా! నాకేమియు సుఖము లేదు. ఆ కార్యము మూన్నాళ్లు నాపిల్ల తలుపుదగ్గర నిలుచుండి నిలుచుండి చివరకు కొంగుపరచుకొని యందే పండుకున్నది. నే నామెవంక నైనను చూడలేదు. ఆమెవంక చూచుటకు నాకు బుద్ధిపుట్టలేదు. ఆమెకై చూడవలెనని

మెప్పుడేని సంకల్పించితినా నాయెదుట నేను ప్రేమించిన యాదివ్యసుందరి సాక్షాత్కరించెడిది. ఇప్పుడు కూడ నదిగో నాయెదుట నా ప్రణయమూర్తి. ఆహాహా?' అని కుట్టాన్ కనులవెంట నీరు పెట్టుకుని యేదో మనోమూర్తిని చూచుచున్నట్లుగా శూన్య దృక్కులను చాచెను. వీరభూపతి హృదయము మిక్కిలి చలించినట్లుగా నతని దేహ మొక వింతకదలిక వెల్లిగక్కించెను.

కొంతసేపైన తరువాత మరల కుట్టాన్ 'వీరా! ఆమె యెంత యందకత్తె. అంత సౌందర్యము భూలోక దుర్లభము. ఆమె దేహంచలరేఖ లెంత విస్పష్టముగా నున్నవి. దినదినమేదో పనిపెట్టుకొని వారియింటికి వెళ్లుచుంటిని. ఆ నెలనాళ్లు నెంతతొందరగా గడచిపోయినవి. ఇంతలో మాతండ్రి నన్ను రమ్మని కబురంపినాడు. నేను వెళ్లక తప్పదు. నేనే సామాన్య సంసారములోనో పుట్టినచో నాకామె యింతదూర మయ్యెడిది కాదు.' అని మరల కన్నీరు కార్ప జొచ్చినాడు.

'ఇప్పుడు నీవు మరల నచ్చటికి పోరాదా?' అని ప్రశ్నించినాడు వీరభూపతి, తన యెడమ చేయి యెడమచెక్కిలి కాన్చి, మోచేయి తొడమీద నుంచుకొని.

కుట్టాన్ —'నే నెందున్నానో యెచ్చట నున్నానో, యేరోజున నేమిచేయుచున్నానో నిత్యము నాతండ్రికి తెలియజేయు చుండవలెను గదా. ఈ రాజధానిలో నేను లేకున్నచో నది నిమేషములో రామనాదుకు తెలియును' అని యొక్క నిట్టూర్పుపుచ్చి 'వారి యిల్లు మా మేనమామల యింటికి మిక్కిలి సమీపములో నున్నది.' అను నర్ధోక్తిలో వీరభూపతి 'అది యేయూరు' అని ప్రశ్నించెను. కుట్టాన్ ఆమాట వినిపించుకొనకుండ, 'నేను మొదట వారి యింటికి వెళ్లుచుండుట వారు నామంచితన మనుకొనిరి. క్రమక్రమముగా తెలిసినకొలది వారికి భయమైనది. నా మేనమామ, యాయనభార్య యీ విషయము తెలిసికొన్నారు. మాతండ్రి కబురువచ్చినది.' అని, 'ఛీ! ఛీ! ఈ జన్మ యెందులకు. నాకోర్కె యింత యలభ్యమైనదని తెలిసికూడ నేను బ్రతికియున్నాను చూడు.' అని కుట్టాన్ పొంగివచ్చుచున్న దుఃఖమును గొంతులో స్తంభింపజేసెను. ఆపొం గణగనిచ్చి వీరభూపతి 'ఆమె నిన్ను ప్రేమించుచున్నట్లు నీకేమైన తెలిసినదా.' అని ప్రశ్నించినాడు.

కుట్టాన్—'అయ్యో!' అని కొంచె మాగి మరల నిట్లు చెప్ప మొదలుపెట్టెను. 'తంబిచ్చి నాయకు డెదురు తిరిగినపుడు మొదట కృష్ణప్పనాయకుల వారి సహాయము చేసిన చిన్న కేశవనాయకునకు మాతాత కుడిభుజము వంటివాడు. అప్పు డాయన చాల పెద్దయాస్తి సంపాదించినాడు. మా మేనమామకు చాల దొడ్లు తోటలు నున్నవి. వారి యింటికి ముందుగానే మామామ పెద్దదేవాలయము కట్టించినాడు. కాశినుండి మాతాత విశ్వేశ్వరాచ్ఛలింగము తెచ్చి ప్రతిష్ఠచేయించకుండగనే చని

పోయినాడు. మామామ యాలింగము నే ప్రతిష్ఠించినాడు ప్రక్కనే స్వామికి 'పుష్పతోట' యున్నది. అ పిల్ల నదివరకు నేను రెండు మూడు సారులు చూచితినిగాని యామె నన్ను చూడలేదు. వారు పెద్దధనవంతులు కాకపోయినను గౌరవకుటుంబము. ఆమె యొకనాడు 'పుష్పతోట'లో పూలుకోసుకుని దండగాచుట్టి వచ్చుచున్నది. నే నామెతో 'నెట్లా మాట్లాడుదని' యని యెదురుచూచుచుంటిని గాన తొందరగా నామె కెదురుపోయి 'శివద్రవ్యము తీసికొని పోరాద'ంటిని. ఆమె నన్ను పూర్వము నిదానించి చూడలేదు గాని నే నెవరో యెఱుగును. నే నీ మాటయనినంత నే నావంక నిదానించి చూచి భయపడినట్లు కనబడినది. నేను చిఱునవ్వు నవ్వితిని. ఆమె మరల నొకయర్ధనిమేషములో పెదవులపైకి చిఱునవ్వు తెచ్చుకుని యా పూలదండ నాకాళ్లపై విసరి యచ్చటినుండి పరుగెత్తుకుని పోయినది. నేను నీకీ మాటలు చెప్పుచున్నా నే గాని యాప్రతివాక్యము నాహృదయమున శూలమువలె దిగబడుచున్నది. వీరా! ఎంతనిర్భాగ్యుడను. 'ఆపూలదండ—'కుట్టాన్ మాటాడలేక పోయినాడు. వెక్కివెక్కి యేడ్వ మొదలిడినాడు. వీరభూపతి యతనిని కౌగిటిలోనికి తీసికొని, 'సేతూ! ధైర్యము పురుషలక్షణము. మనభాగధేయములకు మనమా యధికారులము? అయ్యో! ఏమువకుము.' అని యోదార్చెను.

కుట్టాన్—'అపూలదండ తీసికొని పోదమని నాకు బుద్ధి పొడమెను. కాని వంగితీసికొనబోగా శివద్రవ్యమనిపించినది. ఊరకే యింటికి పోయితిని. నాప్రియురాలి హస్తస్పర్శ పొందిన యాదండయే కృతార్థము. ఇంటికి పోతిని గాని మరల నాపాదములు నన్నచటికే లాగినవి. ఎంత సేపు; అరగడియకూడ గాలేదు. ఆపూలదండ యచ్చట లేదు. నాహృదయము వినిర్భిన్నమైనది. వీరా! ఆదండబదు లచ్చట నొక త్రాచైన పండుకొని యున్నదికాదు. ఆత్రాచును మెడలో వేసికొని యేమై యుందును?'

కుట్టాన్ కుడిచేయి వీరభూపతి కుడిచేతిని పట్టుకొని యున్నది. కుట్టాన్ వీరభూపతిచేయి నొక్కినాడు. కుట్టాన్ దేహమంతయు వణకిపోయినది. ఆచీకటిలో వీరభూపతి కుట్టాన్ దురవస్థను కనులార చూచుచునే యున్నాడు.

వీర—'సేతూ! నీ విప్పు డిట్లు దిగులు పొందరాదు. నీవు మరల వివాహముచేసికొంటివి. ఆమె నీప్రాణము కుస్సురనును. నీ విప్పుడు నీభార్యను ప్రేమించవలసియున్నది! ఈ ప్రేమయంతయు నీభార్యపై మరల్పరాదా!'

వీరభూపతి యీమాటలు మనసా అనలేడు. కుట్టాన్స్థితి యతనికి దుర్భరమనిపించినది. అతని హృదయోద్వేగమున కేదో యొక యడ్డు చెప్పినగాని కుట్టాన్ మంచిస్థితికి రాడని యతనికి తోచి యిట్లన్నాడు.

కుట్టాన్ వీరభూపతియన్న యీమాట వినినతోడనే, 'వీరా! వీరా! ఏమన్నావు? ఆప్రేమ యీామెమీాద కెట్లు మరల్పవచ్చును? ఈవైరాగ్యైనది మా రామనాథ తటాకములో

పోయిపడుచున్నది. ఏదీ యీనదీవేణి నిట్లు త్రిప్పి యింకొక ముఖముగా ప్రవర్తింపజేయుము. నాప్రేమ నీ కంత సులభసాధ్యమైనదిగా కనబడుచున్నదా! కాదు కాదు.' అని వంగియున్న తన దేహమును నిలువుగాచేసిదీర్ఘనిశ్వాసమును విడిచెను. అతనిముఖము గంభీరమయినది. వీరభూపతి కుట్టా నంత వీరుడు కాకపోలేదు. కాని యిప్పటి కుట్టాన్ మొగము జూచి వీరభూపతి చలించిపోయెను. వీరభూపతి యతనిని చూచి 'ఇతడు దేనికి సమర్థుడు కాడు? ఇతడు తలచుకొనినచో పడిపోయిన విజయనగర సామ్రాజ్యము మరల సాధించి మధుర నాయకులచే నేలించు నేమో' యనుకున్నాడు.

అప్పుడు వైగైయిసుక తిన్నెమీద దూరమున నొక సుడిగాలి రేగి, వారిదగ్గరగా నీల వేయుచు పడవలు నిలుచుచోటునకు దాటి పోయినది.

కొంతసేపటిలో కుట్టాన్ వదనము మరల విషాదపూరిత మయ్యెను. వీరభూపతి యింక నుండగూడదని 'పోదమా' అన్నాడు.

కుట్టాన్ 'వీరా! ఈదుఃఖము నాహృదయ శోణితమును త్రాగుచున్నది. ఈప్రేమనన్ను లోపలలోపలనే తినివేయుచున్నది. నే నింక చాలనాళ్లు బ్రదుకను.'

వీరభూపతి—'అశ్లీలములు పలుకకుము' అని 'సేతూ! ఇది యేమి, నే డింత మనసుపేదవైనావు? నీశౌర్యము, నీపౌరుషము నేమైనవి' అన్నాడు. దూరమునుండి 'ఎవరక్కడ' యని కేక వినంబడినది.

వీరభూపతి 'కుట్టాన్ సేతుపతి మహారాజు' అని యఱచినాడు. దూరమున రక్షకభటుడు మరల మాటాడలేదు. వీరభూపతియు కుట్టానును లేచి పురములోనికి పోవుచున్నారు. కుట్టాన్ వీరభూపతిమీద వ్రాలి నడచుచున్నాడు. వీరభూపతి నెమ్మదిగా చెవిలో, 'సేతూ! ఇంతధైర్యము వదలెదరా? ఎవరికి తగిన కష్టము వారికి నున్నది. నాహృదయములో నెంత మహాగ్నిరవులు కొనుచున్నది! అది నీకు తరువాత చెప్పెదను' అన్నాడు.

కొంతదూరము పోయిన తరువాత నిరువురును విడిపిడిగా నడచినారు. పట్టణము కోటతలుపువద్ద నశ్వశకటము వేచియున్నది. ఇరువురు నాశకటములో నెక్కి పట్టణములోనికి పోయిరి. రాజసౌధములకు సమీపమున నొక పెద్దతోట ముందు కుట్టాన్ దిగి వీరభూపతిని వారి యింటివద్ద దింపి రమ్మని బండివానితోఁ జెప్పి తా నింటిలోనికి పోయెను.

౨

కుట్టాన్ ఇరువంకల వివిధములైన పుష్పఫలవృక్షము లున్న బాటవెంట తన సౌధములోనికి బోయెను. ఆసౌధము తనతండ్రిది; రాజ్యములోనున్న పెద్దపెద్ద సరదారులందరకు మధురలో ప్రత్యేకముగ నంతఃపురములున్నవి. కుట్టాన్ తండ్రి శక్తైకదేవ ఉదయాన్ సేతుపతి; ముత్తుకృష్ణప్పనాయక మహారాజులుం గారి

ప్రధానమంత్రులలో నొక్కడు. ఉదయన్ సేతుపతి యీసౌధము మధురలోనున్న గొప్ప కట్టడములో నొకటి. మీనాక్షీ దేవాలయములో నెంత శిల్పమున్నదో యీసౌధమునను నంత శిల్పమున్నది. చీకటిలో శిల్పపరీక్ష సాగదు.

కుట్టాన్ లోనికి పోయినంత నే సేవకు డరుదెంచి, 'ప్రభూ, స్నానమునకు నీరు సిద్ధముగా నున్నది' అనెను. కుట్టాన్ తనగదిలోనికి పోయెను. అందు దాను ప్రవేశించుటతోడనే యెదురుగా నున్న నిలువు టద్దములో దన మూర్తి తనకు గోచరించెను. మొగమంతయు బాష్పకలుషితమై యుండెను. గదియంతయు దీపముల వెలుతురుచేత ధగద్ధగాయమానముగ నుండెను. కుట్టాన్ పైయుత్తరీయము తీసి తన కెడమ వైపుననున్న గోడపై చిలుక కొయ్యకు తగిలించెను.' ఆచిలుకకొయ్య యొక గొప్ప మరకతోపలముతో చేయబడినది. దాని చిలుకతనముకన్నులుగాను, ముక్కుగాను నేర్పరుపబడిన మూడు మాణిక్యములతో సంపూర్ణమయ్యెను. ఇట్టి చిలుకకొయ్యలు గదిగోడలకు నాల్గువైపులను కలసి యెనిమి దేర్పరుపబడి యున్నవి. గోడలయందు ద్రావిడశిల్పమునకు ప్రధానచిహ్నము లయిన గోష్ఠపంజరము లున్నవి. ఒక గోష్ఠపంజరములో ద్రావిడభాషలో శ్రీరామచంద్రుని చరితామృతము ప్రవహింప జేసిన కంబన్న విగ్రహము రాతితో చెక్కిన దమర్పబడి యున్నది. దాని కెదురుగా బశ్చిమదిక్కుడ్యమునం దమర్పబడిన మరొక గోష్ఠపంజరములో శ్రీకృష్ణదేవరాయల వారు శ్రీ విశ్వనాథనాయకుల వారికి మధుర నిచ్చుచున్నట్లుగా చెక్కబడిన రెండు శిల్పపు విగ్రహము లమర్పబడి యున్నవి. దక్షిణపువైపున నొక చిన్నయరుగు రాతితో జెక్కబడి యున్నది. దానిపైన మెత్తని రత్నకంబళము లమర్పబడి యున్నవి. ఆ యరుగున కెదురుగా నొకచిన్న చిత్తరువు గోడకానించబడి యున్నది. ఆచిత్రము పెద్దన్న గారిది. వీరభూపతి యీచిత్రమును వ్రాసి కుట్టాన్‌కు బహుమతిగా నిచ్చెను. కుట్టాన్ అంగీ యూడదీసి యింకొక చిలుకకొయ్యకు తగిలించి యీవితర్దిపై గూర్చుండి పెద్దనగారి చిత్రమువైపు చూచుచుండెను. కొంచెము సేపుండి లేచి తనపుస్తకము లున్న చోటికి పోయెను. కంబ మహాకవి విగ్రహమున కిరుప్రక్కల నొకవైపున తమిళభాషా గ్రంథములును, నొకవైపున నాంధ్ర సంస్కృత గ్రంథములును మెఱుగెక్కించి నగిషీ చేయబడిన సన్నని మెత్తయిన బల్లలపై నమర్చబడి యుండెను. అన్నియు తాటాకుల మీద వ్రాసిన గ్రంథములే.

కుట్టాన్ తా నెందుల కాపుస్తకము లున్నచోటికి వచ్చెనో తెలిసికొనలేక పోయెను.

ద్వారమునుండి 'ప్రభూ! స్నానము చేయుడి' యని ధ్వని వచ్చెను. కుట్టాన్ గది వదలిపెట్టి స్నానమునకు పోయెను.

ఆ మహాసౌధమునకు పశ్చాద్భాగమున నాల్గుపోక బోదెల నడుమ కొంచెమెత్తయిన

చంద్రకాంతపు రాతిపై కుట్టానాసీనుడాయెను. ఇరువురు సేవకులు రెండు పెద్దబిందెలలో నొకదానినిండ వేడినీరును, మరొకదాని నిండ చన్నీళ్లును తెచ్చి యతనికి నీరువోసిరి. స్నానముచేసి కుట్టాన్ దేహము తుడుచుకొనుచుండెను. (అతడు తుడుచుకొనుట లేదు. సేవకులే తుడుచుచుండిరి. ఇది రాజాచారము.) అప్పుడే చంద్రు డుదయించుచున్నాడు. మంచి గంధపుపొడిచే సమ్మిశ్రితమైన సున్నిపిండిచేత రుద్దిన యతని దేహము కమ్మనివాసన లతనికే చాల ఆనందము కలిగించెను. ఇంకొక సేవకుడు కస్తూరి కలిపిన యొక కమ్మని నూనె చేతులకు రాచుకొని యతని తలవెండ్రుకలకు రాచెను. ఈ కమ్మని వాసనలచేతను, ఉదిత చంద్రకిరణ శైతల్యము చేతను కుట్టాన్ మనస్సు కలక దేరిన ట్లయ్యెను.

భోజనముచేసి కుట్టాన్ సౌధపురోభాగమున నున్న మంటపములో గూర్చుండెను. దాక్షిణాత్యశిల్పము పల్లవులనాటి కన్న చోళులనాటికి, చోళులనాటికన్న విజయనగర రాజులనాటికి నంతకంత కభివృద్ధి పొందుచు వచ్చినది. తంజావూరు మధురాపురముల శిల్పమును దాక్షిణాత్య శిల్ప చరిత్రలో విజయనగర శిల్పమునుండి విడదీయరు. తంజావూరు మధురల శిల్పము విజయనగర శిల్పముకన్న నెక్కువ వృద్ధిపొందినదని చెప్పవచ్చును. మన కథా కాలమునాటికి, ననగా ముద్దుకృష్ణప్ప నాయకుని కాలమునాటికి, నది యాధునిక శిల్పముగా మారబోవు పరివర్తనమునం దున్నదని చెప్పవచ్చును. పల్లవులనాడు రథములును, చోళుల నాడు గోపురములును, విజయనగర రాజుల నాడు మంటపములును దాక్షిణాత్య శిల్పమునందు ముఖ్యములు. ఆయా రోజులలో నవి వృద్ధిపొందినవి. ఉదయర్క సేతుపతి తన యీ దివ్యసౌధము ముందు గొప్ప మంటపమును కట్టించి తనకు శిల్పవిద్యయందున్న యభిమానమును వెల్లడించుకొనెను.

ఆ మంటపములో పరచియున్న రత్నకంబళముపై కుట్టాన్ ఆసీను డయ్యెను.

ఆ పలుచపడుచున్న వెన్నెల పొరలలో నామంటపమునం దాసీనుడైయున్న యారాచకొడుకును చూచిన నమరావతిలో జయంతుడు మన్మథమంటపమునం దున్నట్లు చూపట్టకమానదు.

దూరమునుండి వీరభద్రభట్టరు కుట్టాన్‌ను చూచి యతడు సంతుష్టుడై యున్నాడనుకొని వినయముతో సమీపించి, 'ప్రభూ! పండుకొనుటకు వేళ మైనది' యన్నాడు. కుట్టాన్ కొంచెము కోపదృష్టితో నాతనివంక చూచెను గాని పోకచెట్ల మొవ్వల వెనుకనున్న వెన్నెలనీడలో వీరభద్రభట్ట రది చూడ లేదు.

వీరభద్రభట్టరు కుట్టాన్ సత్ప్రవర్తన కలిగియుండునట్లు చూచుట కేర్పడిన యధికారి. కుట్టాన్ ఇతనికి తెలియకుండ నేపనిని చేయరాదు.

కుట్టాన్ లేచి లోనికి పోయెను.

రాజ దివాణములో జాము గంటలు కొట్టిరి. అందఱకు నిద్రావేళ యయినది.

కుట్టాన్ పడకగదిలోనికిబోయెను. పడక గది విశాలమయినది; ముందున్న మంటపమంత యున్నది. పైకప్పు మిక్కిలి యెత్తుగా నున్నది. ఇది సౌధములో రెండవ యంతస్థునందున్నది. గోడలనిండ గచ్చుపని చేసియున్నది. చిత్రచిత్రవర్ణములతో లతలు, చిలుకలు, చెట్లు గీయబడి యున్నవి. గోడలనిండ నొకవరుసగా ననేకచిత్రములు వ్రేలాడుచున్నవి. ఆచిత్రములన్నింటిలో మొగలులచిత్రవిద్యాచిహ్నములు స్పష్టపడుచున్నవి. పురాణకథ లనేక విధములుగా కుడ్యములనిండ చెక్కబడి యున్నవి. తూర్పుగోడయందు నొకచిన్న గూడుగా నేర్పరుపబడి యందొకరత్న ముంచబడినది. ఆ రత్నకాంతులు గది నంతయు తెల్లని వెలుగులో ముంచియెత్తినవి. గోడలవెంట చంద్రకాంత శిలావితర్దికలు, గొప్పపనికలిగినబల్లలు నుంచబడి, వానిపైన సువాసనాద్రవ్యములు, దంపతుల కానందమిచ్చు కొన్ని చిత్రములు, అద్దములు, చిలుకలు సమర్పబడియున్నవి. ఆగదికి వెనుకవైపున పెద్ద గవాక్షమున్నది. ఆ గవాక్షమునుండి దొడ్డిలో నెత్తుగావేయబడిన మల్లె జాజి పందిరుల మీది సువాసనా భరితమైన చల్లనిగాలి యుండియుండి లోనికివచ్చుచున్నది. ఆగవాక్షమువద్దనే పెద్దమంచ మున్నది. ఆ మంచము పందిరి స్తంభములు మహాశిల్పమును సూచించుచున్నవి. ఉపానము, పద్మము, కుముదము, వేదిక, నాగబంధము, కలశము, 'పుష్పబోదిగ' యన్నియు కొద్దిలో నా నాల్గు కంబములు సర్వసుందరముగా నున్నవి. పందిరి నుండి యనేక రత్నములు వ్రేలాడుచున్నవి. మంచము మిక్కిలి యెత్తుగా నుండి పైన వేయబడిన మైదుపరుపులవలన మానిసియెత్తున్నది. మంచముపైకి పోవుటకు మెట్లున్నవి. మంచము తలవైపున, కాళ్లవైపున ప్రక్కగా రెండు స్తంభము లున్నవి. ఆ రెండు స్తంభములు మంచ మెత్తుననే యున్నవి. తలవద్ద కంబముపైన యొకబంగరు పళ్లెరమున తాంబూల ద్రవ్యములు, సువాసనా ద్రవ్యములు నుంచబడినవి. పందిరికంబమున నున్న నాగబంధమునందు రెండుసుదీర్ఘములు, మందారకుసుమగుంఫితములు, సంగతలపలికిసాలములునగు మల్లెపూవుల దండలు వ్రేలాడుచున్నవి. సెజ్జ నిండుగ మల్లెలు జాజులు దట్టముగ జల్లబడి యున్నవి. ఆమంచము ప్రక్కగా నింకొక మంచ మంతయెత్తు లేకున్నను సమానమైన సౌందర్యము కలది యున్నది. అందు మల్లికా సుమంబులు వెదజల్లి లేవు.

కుట్టాన్ పాముకుబుసములవంటి పంచెలొకటి కట్టుకొని యొకటి పైన వేసుకున్నాడు. యథాప్రకారముగా దన పెద్దమంచముపై పండుకొనుటకు పోయి మెట్లెక్కినాడు. ఒత్తుగా పరచిన మల్లెపూవులలో నేకవీర గోధుమ వన్నె త్రాచువలె ముడుచుకుని పండుకున్నది. కుట్టాన్ నిర్ఘాంతపోయినాడు. ఏకవీర యెప్పుడును తనమంచముమీాద పండుకొని యెఱుగదు. ఆమె కాపురమునకు వచ్చి మూడు నెల

ళ్లైనది. ఆమెను పతి పలుకరించలేదు. పతి నామె పలుకరించలేదు. పెద్ద మంచముమీద కుట్టాన్, చిన్న మంచముమీద నేకవీర; ఇట్లు మూడు నెలలు గడచినవి. నేడిది యేమి? ఏకవీర కుట్టాన్ శయనించు మంచముమీద పండుకొని నిదురపోవుట కెట్లు సాహసించినది? ఏకవీర నిత్యమును నాకుపచ్చ వారణాసిచీర ధరించును. పైన బంగరుటంచు కాశ్మీరపు సేలువ పై ముసుంగిడుకొనును. ఒడలినిండ వెలలేనినగలు ధరించును. నేడిదేమి? తెల్లని పట్టుకోక కట్టి పరిమిత భూషణములు ధరించినది. మేనగంచుకము లేదు. అభ్యంగము చేసినది కావలయును. శిరోజములు పొడిపొడిగా నుండి చల్లగాలి కల్లలనాడుచుండెను. తలంటి పోసుకున్నది, యొడలు తెలియక నిద్రపోయినది. కుట్టాన్ మిక్కిలి కోపము పొందెను. 'ఈదౌర్భాగ్యురాలు నాశయ్య నలంకరించగలదా? ఇన్నాళ్లనుండి లేనియాశ దీనికి నేడేల పుట్టవలయును?' ఏమహాసౌందర్యరాశి నా శయ్య విభాగించుకొనవలయునో యామెకు నాకు నీజన్మమున కలయికయే లేదు. నన్నీపిశాచ మావేశించినది. అయ్యో! ఈదయ్యము నన్నెట్లు వదలును?' కుట్టాన్ కుకొంచెము కోపము తగ్గినది. 'అయ్యో! నాకీమె సహధర్మచారిణి కదా! ఈమె నన్ను వదలి యెచ్చటికి పోవును? ఇన్నాళ్లుగా నేను మాట్లాడకుండ నుండిన నెంత శోషిల్లినదో. నాతో నొక్కనాడు పలుకలేదే! స్త్రీ యెట్లు పలుకరించును? పురుషుడు తన యందు విముఖుడుగా నున్నపుడు స్త్రీకి తూష్ణీంభావమే ప్రధానము.' ఇంతలో కుట్టాన్ నేత్రములు మూతలుపడినవి. ఎట్టయెదుట నాతనిహృదయ మాకర్షించిన లతాంగిరూపము సాక్షాత్కరించినది. కుట్టాన్ ఆ జగన్మోహన విగ్రహమును చూడలేక పోయినాడు. తటాలున కనులు తెరచినాడు. కనులలో నిండుపగింజలంత బాష్పములు నిలిచినవి.

ఏకవీర కదలినది. మూతవడిన యామె రెప్పలమీద గుడ్లుపోసినట్లు చిన్ని చిన్ని స్వేదబిందువులు నిలిచినవి. ఆహా! ఏ మావదన సౌందర్యము! కొండపైనుండి దూకు సెలయేఱు ప్రాతఃసూర్యకిరణములలో ధగద్ధగితమయినట్లున్నది. కుట్టాన్ సమ్మోహితుడైనాడు.

ఇదివరకు కుట్టాన్ ఏకవీరను పరిశీలించి చూడలేదు. ఆమె సౌందర్యవతి యనియే యనుకొనలేదు. అప్పుడప్పుడు 'ఆమె సౌందర్యవతియే యనుకొందము. అయిన మాత్రము నాకేమి? నాహృదయ మామెది కానేరదు.' అనుకొనుచుండును.

ఏకవీర పయ్యెద తొలగినది. కుట్టాన్ కనులు మూసికొన్నాడు. తన ప్రణయిని యెదురైనది. శోకములో కోపము తరుముకొని వచ్చినది కుట్టాన్ మహారాజునకు. అన్యాయ్యముగ తనశయ్య నాక్రమించుకొన్న ఏకవీరను క్రిందకు లాగివేయుద మనుకొన్నాడు. ఏకవీర దొంగనిద్రపోవుచున్నదని భావించినాడు. కోపముతో నత డామెచెక్కిలిపై శత్రుమారణసమర్థమయిన హస్తమును తీవ్రముగా విసర

బోయినాడు. అతనికి తెలియకుండగనే మహా బుద్ధిమంతుడగు కుట్టాన్ కరపద్మము పువ్వుల దండవలె నేకవీర చెక్కిలి కంటినది.

ఏకవీర యులికిపడి లేచినది. ఇద్దరు నిస్తబ్ధులై యున్నారు. ఏకవీర మనసులో ననుకున్నది: 'నాతండ్రి నాకీసంబంధము చేసి నాల్గు నెలలైనది. ఈయన యింతవరకు నామొగము చూడలేదు. కార్యమునాడు కొంగుపరుచుకుని తలుపుదగ్గరనే పండుకుంటిని. నా గారామంతయు నిట్లయినది. ఈ క్రొత్తప్రదేశమునకు నేను లాగుకొని రాబడితిని. నాకు దిక్కు లేదు. మాటాడువారు లేరు. దాసీలతో నారహస్యము నేమని చెప్పను? దినదినము మాగదిలోని యనుపయుక్తపదార్థములను చూచి దాసీలు నవ్వుకొనుచున్నారు; నక్నడుగుచున్నారు. ఏమియు జెప్పలేకుంటిని. ఈ వివాహమునకు బూర్వము నాహృదయ మింకొకనియందు లగ్నమయినది. అతడెవ్వరో యేయూరివాడో తెలియదు. మానిసి సాధారణ కుటుంబములోనివాడుగా నున్నాడు. అతనిని వెదకి లాభము లేదు. నాపుణ్యమువలననే నాకీ కుట్టాన్ సేతుపతి లభించినాడు. అతనికన్న ముందయితనిని చూచిన నెంతబాగుండెడిది? ఇప్పుడైన నేమి? ఇతనినైన నకల్మషహృదయముతో సేవించగలను. ఇతనికి నాయందు ప్రేమ లేదు. ఇతనిప్రేమ కోసము కృశించి కృశించి యీనాడు సాహసించి యీశయ్యపైన పండుకున్నాను; నిదురపట్టినది. నాయీ సాహసమున కితడేమనుకున్నాడో?' ఈ భావములన్నియు నేకవీర మనస్సులో నొక్కసారి మెఱుపువలె మెఱసినవి. కుట్టాన్ అనుకొన్నాడు: 'ఈమె యెంత యందకత్తె! నన్ను చూచి యెంత లజ్జపడుచున్నది. ఇప్పుడేమి చేయను? ఇన్నాళ్ల నుండి నాతప్పు మన్నించుమందునా? ఛీ! ఛీ! ఆనాప్రియురాలియెడ నేనంతతప్పుగా ప్రవర్తింతునా! ఈహృదయ మామె కిదివరకే యర్పితమైనది. ఇంక నొరుల కిది యీయజాలను!'

ఏకవీర నెమ్మదిగా మోకాళ్లమీద లేచి పందిరికంబమున నాగబంధమునకు తగిలించబడిన మల్లెపూదండ యొకటి తీసి యొక యర్ధనిమేషములో లజ్జావనతవదనయై కుట్టాన్ మెడలో వేసినది. ఆ పూమాల మెడలో పడినదో లేదో, కుట్టాన్ రుద్రమూర్తియైనాడు. తాటకనుచంపుటకు రామచంద్రుడు ధనుస్సు నంతవడిగా లాగెనో లేదో, ఆపూలదండను కుట్టాన్ అంతవడిగా రెండుగా త్రెంచి నేలమీద విసరినాడు. ఏకవీర మంచముపైన విరుచుకుని పడిపోయినది. ఇంక కొంచెమైనచో క్రిందబడెడిది, నిలువెత్తునుంచి తల పగిలిపోయి యుండును. కుట్టాన్ కన్నులనీళ్లు గిర్రున తిరిగినవి. కుట్టాన్ మెట్లుదిగి చిన్నమంచముపైన పోయి పండుకున్నాడు. వెక్కివెక్కి యేడ్చుచున్నాడు.

ఏకవీరకు నిమేషములో నొడలు తెలిసినది. పతి పజ్జలేడు. తన చిన్నమంచముపై బండుకున్నాడు. తాను మంచము తొందరగా. దిగి, కంచుకము ధరించి, సాధారణముగా దాను ధరించుచీర తాల్చి యొడల నన్ని భూషణము

ఱను పెట్టుకొని, కాశ్మీరసేలువ ముసుగిడి, కన్నుల నీరు గ్రమ్మగా తన చిన్నమంచమువద్దకు పోయి, రుద్ధమైన కంఠమునుండి మాట పెగుల్చుకుని, 'ప్రభూ! మీరు తమ మంచముపైననే పండుకొనుడు. నే నిందు పండుకొనెదను' అన్నది.

ఆమెవంక తిరిగి కుట్టాన్ చూచుసరికి యతనికన్నులు గిఱ్ఱున తిరిగిపోయినవి. హృదయము సహస్రధా విశీర్ణమైనది. కుట్టాన్ తాను చేసినపనికి చాల నొచ్చుకున్నాడు. ఏకవీరను కౌగిలించుకొని యామె శిరస్సున బాష్పాభిషేకము చేయవలె ననుకున్నాడు. ధైర్యము చాలలేదు. కుట్టాన్ నెమ్మదిగా లేచిపోయి తనమంచముపై నిదురించినాడు. ఏకవీర కన్నీళ్లతో చిన్న మంచముపై నున్న నాలుగుపరుపులు నడుగుదాక చివికిపోయినవి. ఏరాత్రివేళనో యామెకు నిద్రవచ్చినది. తెల్లవారుకడ కుట్టాన్‌నకు మెలకువ వచ్చినది. ఏకవీర యున్నదో లేదో యని యామె మంచమువంక జూచినాడు. ఆమె యందే వాడిపోయిన మందారమువలె మంచమున కంటుకొనిపోయియున్నది.

మఱునాడు దాసీలు నేలమీది పూలదండలు చూచి సభయనేత్రలైరి.

3

మఱునాడు కుట్టాన్ నిదురలేచి కాల్యకృత్యముల దీర్చికొని, రతనాల జీను వేసి సిద్ధముగా నుంచబడిన యశ్వముపై నెక్కి కోట వెలుపలిభాగమునకు పోయెను. అచ్చట నదివరకే సమావేశమై నానామండలాధిపుల కుమారులు బారులు దీర్చి నిలుచుండిరి. మొదట తిరుచునాపల్లి మండలాధిపుని కుమారుడు. అతడు తెల్లనిగుఱ్ఱముపై నధిరోహించియుండెను. వయ సిరువదియేండ్లుండవచ్చును. తెల్లనియంగీ. తలపైన పచ్చలసరిము చుట్టున నున్న యుష్ణీషము. అతనిపజ్జ తిన్నెల్వేలి మండలాధిపుని కుమారుడు. అతనిపజ్జ సత్యమంగలమండలాధిపుని తనయుడు. వీరిరువురు సమానవయస్కులు; చూచుట కన్నదమ్ములవలెకూడ నుండిరి. అనంతరము మానామధుర మండలాధిపతియొక్కయు, శేందమంగళ మండలాధిపునియొక్కయు కుమారులు జోడుకోడెలవలె నిలుచుండిరి. వారిరువురు మేనత్త మేనమామలబిడ్డలు. పోలికలు రేఖలు నొకటిగా నున్నవి. ఇరువురకును పదునెనిమిదేండ్లు దాటలేదు. వారిగుఱ్ఱములు భూమిమీద నిలుచుటలేదు. వారు బాలకులయ్యు నెంతయో పరిశ్రమగలవారివలె తా మెక్కిన యుత్తమజాత్యశ్వములను, తమ దేహములను కదలించుచు, పాదములను చాచుచు నడుపుపెట్టుచుండిరి. ధారాపుర, మారమంగళ, శేల, కణ్ణివీడు, పాలెగాండ్ల కుమారులు తరువాత వరుసగా నిలువబడియుండిరి. ఇంక ననేకమంది రాజకుమారులుండిరి. అందఱెక్కినవియు నుత్తమజాతిగుఱ్ఱములు. అందరి దేహములయందును వెలలేని భూషణములు. ప్రతివాని మొగమునందును శౌర్యలక్ష్మి. కుట్టాన్ పోయి వీరందరకును

మొట్టమొదట తనగుఱ్ఱమును నిలువబెట్టెను. తరువాత ప్రధాని కుమారుడును, రాయసం కుమారుడును వరుసగా వచ్చి వారియుచిత స్థానములయందు నిలువబడిరి. రాజసైన్యము బారులుతీర్చి వీరికి దూరముగా నిలువబడి యుండెను.

ఈరాజకుమారులుతీర్చిన బారున కెదురుగా నొకముసలి యుద్ధవీరుడు తెల్లని గడ్డమును, మీసములును భీష్మాచార్యభ్రాంతి గల్పింప, మహోన్నతమైన శ్వేతాశ్వముపై నెక్కి నిలువబడియుండెను.ఆయన వీరందరికి శిక్షాగురువు. మధురనాయకుల రాజ్యములలో దళవాయి ప్రధాన సేనాపతి.ఉదయన్ సేతుపతి కుట్టాన్ తండ్రి దళవాయి. మొదటి ముగ్గురునాయకుల కాలములలో మహామేధాశాలియగు నార్యనాథుడీ పదవియం దుండెను. ఈపాండ్యపార్థివ ముద్దుకృష్ణ నృపతికి ఉదయన్ సేతుపతి దళవాయి యైనాడు. ఉదయన్ సేతుపతి మహాసమర్థుడు. గొప్పసేనాని. రాజకార్య నిపుణుడు. సేతుపతులు నాయకులతరమువారు గాదు. పాండ్యరాజులనాటినుండియు మధురరాజులకు మండలాధిపులుగ నున్నారు. రామనాథప్రాంతమున నున్న దేశమంతయు వీరి వశమున నున్నది. రామేశ్వరమునకు పోవుమార్గములో చోరభయ మెక్కువై తైర్థికులకు మిగుల కష్టములుగానుండుటచేత నుదయన్ సేతుపతి యెక్కువ కాల మాప్రాంతముననే యుండవలసివచ్చినది. ఆయన లేని కాలములో సైన్యమంతయు నీ వృద్ధసింహముచేతిలో నుండును. ఈయన పేరు కస్తూరి రంగప్పనాయకుడు. విశ్వనాథ నాయకుని మనుమడైన వీరప్పనాయకునకు ముగ్గురు కుమారులు: రెండవ కృష్ణప్పనాయకుడు, విశ్వప్ప, కస్తూరి రంగప్ప. ప్రస్తుతము రాజైన ముద్దుకృష్ణప్పనాయకుడు విశ్వప్ప కుమారుడు. కస్తూరి రంగప్ప ముద్దుకృష్ణప్ప రాజ్యమునకు రాకపూర్వము రాజ్యాపహరణము చేసినందున నతనిని ప్రజలు సంధ్యామంటపములో మడియించిరి. ఈవృద్ధసింహ మా కస్తూరి రంగప్ప నాయకునకు బావమరంది. ఈయన పేరు కస్తూరి రంగప్పయే. ఈయన ప్రస్తుత రాజునెడల నభిమాని.

ఆవృద్ధుని కంటిచాయనుండి రాజకుమారు లొకరొకరే ముందరికి వచ్చి బాకువేయుటలో తీయుటలో, కత్తి ఝుళిపించుటలో విసరుటలో, గుఱ్ఱమును దుమికించుటలో నురికించుటలో తమ ప్రావీణ్యమును చూపిరి. తరువాత నీరాజకుమారులందరును సైన్యమువద్దకు తీసికొనిపోబడిరి. కస్తూరి రంగప్ప నాయకులు కుట్టాన్‌ను పిలిచి సైన్యముచేత సర్వతోభద్ర వ్యూహము పన్నించుమన్నాడు. కామందకుడు సర్వతోభద్రవ్యూహము శత్రుహృదయ నిర్భేదక మన్నాడు. కుట్టాన్ తత్‌క్షణమే వ్యూహమున కురమును, కక్షలును, కోటియు, జఘనమును సంపాదించి యచలాకృతి నిలువజేసినాడు. పొదలవలె పెరిగిన ముసలి కస్తూరి రంగప్పనాయకుని తెల్లని కనుబొమలలో సంతోషపు కదలిక గలిగినది. వృద్ధవీరుడు కుట్టాన్‌తో 'నాయనా, సైన్యముయొక్క జ

జఘన మాపత్తులో నున్న యెడ నే వ్యూహము పన్నెద'వని యడిగెను. కుట్టాన్ సమాధానము చెప్పకుండ నే సర్వతోభద్ర వ్యూహమును మకరవ్యూహముగా మార్చి వృద్ధపండితుని సంతోషింప జేసెను. అనంతరము తక్కిన రాజకుమారులందరును క్రమముగా శ్యేనసూచీ శకట వజ్రవ్యూహాదులను పన్నియు రంగప్ప నాయకున కానందము కలిగించిరి. కుట్టాన్ కక్షులు లేకుండ నొకవ్యూహము పన్ని రంగప్ప నాయకునివంక చూచెను. రంగప్ప 'వహ్వారే' యని మెచ్చుకొనెను. అనంతరము జాముప్రొద్దెక్కగా రాజకుమారు లెవరితావునకు వారు పోయిరి. సైన్యము కస్తూరిరంగప్ప యధీనమున కొంత సేపు మెలగి నియమితస్థలములకు పోయినది. కుట్టాన్ గృహమునకు బోయి మరల స్నానమాడి భోజనాదికములు నిర్వర్తించుటకు సౌధాంతర్భాగమునకు బోయెను. ఎఱ్ఱని కాశ్మీరశాలువ ముసుగులో ప్రక్కగా బోవుచున్న ఏకవీరిను చూచెను. కుట్టాన్ వచ్చుచున్నాడని తెలిసి యామె తొందరగా పోదొడగెను. కాని మంజీరము కాలికి నొక్కుకొనగా కొంచెము నిలుచుండి వంగి సర్దుకొనక తప్పినది కాదు. కుట్టాన్ ఆమె లేతమలపాకుల వంటి చేతులు కాళ్లు పరీక్షగా చూచెను. అవి యంత సుకుమారములా! కుట్టా ననుకొననే లేదు. భోజనానంతరము కుట్టాన్ తాను చదువుకొను గదిలోనికి బోయెను. కుట్టాన్ చేయి యప్రయత్నముగా కౌటిల్యుని యర్థశాస్త్రము మీదికి పోయెను. తీయగనే యంతఃపుర రక్షణము గురించిన వాక్యములు వచ్చెను. కామందకుడును, కౌటిల్యుడును నీవిషయములో నొక్కటే యభిప్రాయులై యున్నారు. కౌటిల్యుడంతఃపురరక్షణమును గురించియు, నంతఃపురమునుండి రాజునకు వచ్చు నాపదల గురించియు తెలియజేయుట కెట్టి యుదాహరణల నిచ్చెనో కామందకుడుగూడ నవియే యిచ్చెను. తన భార్య గదిలో దాగియుండి యతని తమ్ముడు భద్రసేనుని చంపెను. తల్లిశయ్యక్రింద నడగియుండి కారూశనృపతి నతనికొడుకు సంహరించెను. కాశీరాజును, వైరాంత్యుని, సౌవీరుని వారిభార్యలే చంపిరి. — ఇది చదువు వరకనవసరముగా కుట్టానునకు భయము కలిగెను. కుట్టాన్ మరల ధైర్యము తెచ్చుకొనెను. కుట్టాన్ హృదయములో గలిగిన కొంచెమావేదన తగ్గించుకొనుటకు కంబరామాయణము తీసి యొక పద్యము చదువుకొనెను. కుట్టానునకు సంగీత మెక్కువగా రాదు గాని రాగచ్ఛాయగా పద్యము చదువుకొనగలడు.

ఇంతలో వీరభద్రభట్టరు ద్వారముకడకు చనుదెంచి యశ్వశకటము సిద్ధముగా నున్నదని చెప్పెను. కుట్టాన్ దుస్తులు వేసుకొని వీరభద్రభట్టరుతో గలసిపోయెను. శకటము రాజసౌధము లున్నయెడకు బోయెను. అందొక మహాసౌధము ప్రత్యేకముగా రాజపురుషులకు రాజనీతి నేర్పుట కేర్పరుపబడినది. కుట్టానును, వీరభద్రభట్టరును లోనికి ప్రవేశించిరి. లోపలిభాగమతివిశాలముగా నున్నది. నేలయంతయు వెలు

పగల తివాసీలు పరుపబడి యున్నవి. వానిపైన పండితు లాసీనులై యుండిరి. రాజకుమారు లనేకులు వచ్చిరి. ఒక్కచోట భోజునియుక్తి కల్పతరువు, మరొకచోట జీమూత వాహనుని దాయభాగము, ఇంకొకచోట చండీశ్వరుని వివాదరత్నాకరము పాఠములు చెప్పబడు చుండెను. ఇంకొకచోట నొక ద్రావిడభాషా పండితుడు తమిళభాషలో వ్రాయబడియున్న విజ్ఞానేశ్వరవ్యాఖ్య బోధించుచుండెను. మరొక చోట వేరొక పండితుడు సంస్కృత భారత మును, రామాయణమును, నానాటి రాజ నీతిని కొందరు విద్యార్థుల కుపన్యసించు చుండెను. కుట్టాన్ భారత రామాయణము లుపన్యసింపబడుచోట గూరుచుండి శ్రద్ధగా వినెను. కొంచెము ప్రొద్దుగ్రుంకువేళకు రాజు మొగసాలలో గంటకొట్టబడెను. అది విని విద్యార్థు లెవరిదారిని వారుపోయిరి. వీరభూపతి యీపాఠశాలకు వచ్చెను. ఇంటికి పోవునపుడు కుట్టానును కలుసుకొనెను. ఇరువురును సంతోషపడుచు సేతుపతిగృహమునకు పోయిరి. వీర భద్రభట్టరు పనియుండి రాజసౌధము వద్దనే దిగబడెను. మార్గములో వీరభూపతి కుట్టాన్ తో నిట్లు మాటాడెను: 'సేతూ, నీతోనొకపని యున్నది.' కుట్టాన్ 'ఏమి' టని యడిగెను.

వీర—'తిరుమలనాయకుడు నీకు స్నేహితు డుగదా! నా కేదైనయుద్యోగ మిప్పించవలెను. నేను నీతిశాస్త్రమంతయు జదివితిని. విజ్ఞానేశ్వరము, వైశంపాయనుని నీతిప్రకాశిక పూర్తి చేసితిని. కౌటిల్యుని యర్థశాస్త్రము, కామందకుని నీతిసారములలో చాల బాగుగ పరీక్ష నిచ్చితిని. నే నుద్యోగము చేయవలసిన యవసర మంతకంత కెక్కువగుచున్నది.'

కుట్టాన్—'తిరుమల నాయకుడు నేడు విద్యాసౌధమునకు రాలేదే! ఈ సారి నే నాయనను కలుసుకొన్నప్పుడు చెప్పెదను. వారు నిన్నుగూడ బాగుగా నెరుగుదురుకదా?'

వీర—'ఎరుగ కేమి?'

తరువాత నేదియో మాటలాడుచు వారి యింటికి చేరిరి. వారిరువురు కుట్టాన్ గదిలోనికి బోవునప్పటి కందు ఫలహారములు సిద్ధముగా నుంచబడెను. ఇరువురును ఫలహారముచేసి తాంబూలము సేవించి కూర్చుండగా కుట్టాన్ వీరభూపతిని కొంచెము సంగీతము పాడుమని యడిగెను. వీరభూపతి మధుర మీనాక్షిమీద నొక యరవకీర్తన గొంతెత్తి పాడెను. ఆధ్వనితో సౌధమంతయు నిండి పోయినది. పారిజాతపు పూవులు కొరుకుచున్న లేడిపిల్ల మెడ యాడించుకొనుచు లోనికి వచ్చి వీరభూపతి వంక తొంగిచూచి పోయినది.

౪

ప్రొద్దుగ్రుంకినది. చల్లబడినది. రాజసౌధముల ముందు మొగసాలలో మ్రోగింపబడుచున్న భేరీరావములు మేఘధ్వానములని భ్రాంతిజెందిన పెంపుడునెమళ్లు నృత్యము చేయుచున్నవి. సాయంకాల వాహ్యాళికై కుట్టాన్ వీరభూపతు లశ్వశకటారోహము

చేసి వైఁగైనదీ సికతాతలములకు బోయి నారు. కుట్టాన్ సేతుపతి కొంచెము పొట్టి వాడు. నల్లనివాడు. విశాలమైన నేత్రములు. దైనందినవ్యాయామముచేత నతని యొడలు గట్టిబారినది. సంస్కృత ద్రావిడములలో నున్న రాజనీతిగ్రంథము లన్నియు నతడు చది వెను. అతని వయస్సు సుమా రిరువదియైదుం డవచ్చును. మీసములు నల్లగా తుమ్మెద రెక్కలవలె నంత గుబురుకాకుండ, నంతపలు చన కాకుండ వచ్చియుండెను. అతని మొగ ముచూచుటతోడనే ప్రధానముగా గనబడు నది యతని నాసిక. నది మిక్కిలి యెత్తు. ఆ ముక్కు, నావిశాలపద్మపలాశనేత్రములు నతని మొగమ్మున కమితమైన యందము తెచ్చినవి. ఆవిశాలమైన నేత్రములే యతని నత్కులీనతను చెప్పుచుండును. కుట్టాన్ మిగు లగంభీరమైనవాడు. అనవసరముగ నెవ్వరితో డను మాటాడడు. అతని కిష్టములేని పని నెవరైనను చేసిరేని వారివంక తీక్ష్ణమైన దృష్టి పరపుటయే యతడు తనయిష్టము లేమిచూ పించుట. ఆదృష్టిపాతము చాల కొలదిమంది యోర్చుకొనగలరు. అతడు ప్రసన్నుడైనప్పు డతనినవ్వు మిత్రుల నానందము గలిగించును. అతని సర్వము ఉదయన్ సేతుపతితరువాత నతనియంతవాఁడనిపించుచుండును.

ఇంక వీరభూపతి యెఱ్ఱనివాడు. పొడు గరి. శరీరవ్యాయామము మిక్కిలిగా చేయని వాడగుటచేత నితని యెదురుబొమ్మ కుట్టాన్ బొమ్మవలె తిర్యక్ప్రసారితమైన గండశిలవలె నుండదు. అతని నేత్రములు కుట్టాన్ నేత్ర ములంత విశాలమైనవి కావు. కాని మఱియు చిన్నవి కావు. నాసిక సామాన్యమైనది. అతని మొగము చూచినంతనే ప్రతివాడు నతడు సుందరు డనుకొనక మానరు. కుట్టాన్ మొగ ములో నానుపూర్వికముగా యుద్ధముచేసి రాజ్యము నేలుచువచ్చిన పితరుల చిన్నెలు ద్యోతకమగుచుండును. వీరభూపతి వదనము శాంతమై చాలతరములనుండి వ్యవసాయము, చదువు వీనియందలవాటు వడిన పితరుల చిన్నెలు కనబరచుచుండును. వీరభూపతి మీస ములు చివరలు మెలికలు తిరిగి తామరపూవు మీదవ్రాలినభృంగముల ననుకరించుచుండెను. మొత్తముమీద కుట్టాన్ వదనము పురుషు లెక్కువ మెచ్చుకుందురు. వీరభూపతి వద నము స్త్రీ లెక్కువ మెచ్చుకొందురు. వీరభూ పతి మొగము క్రోధముచే నెఱ్ఱబడినను నవ్వు చున్నట్లే యుండును. అతడు నవ్వుచున్నపుడు కన్నులు చిన్నవై చూచువారిని సూదులవలె గ్రుచ్చుచుండును. కుట్టాన్ నడచునపుడు మిక్కిలి తొందరగా నడచును. వీరభూపతి నెమ్మదిగా నడచును. కుట్టాన్ ఉదయన్ సేతు పతి కొక్కడే కుమారుడు. ఉదయన్ సేతుపతి 'తేవై'పురాధిపతి. సేతువులను రక్షించుట కేర్ప డిన యధికారి. రాజ్యములో ప్రవహించు నదులకు సేతువులను కట్టి వానిక్రింద భూము లను సాగుచేయుచుండిరి. ఈసేతువుల కన్నిం టికిపైన నతడధికారి. అతడు చాల శివభక్తుడు. అరియరాయుని సైన్యములను నిర్మూలించి

నాడు. ముద్దుకృష్ణప్ప నాయకునికి ప్రధాన మంత్రి. అతని కుమారుడైన కుట్టాన్‌నకు ఏలోపమును లేదు. కుట్టాన్ తనతండ్రి తరువాత నతనిస్థాన మాక్రమించుకొనుటకు తగిన శిక్ష మధురలోఁ బొందుచున్నాడు.

వీరభూపతి జన్మస్థానము రాజవల్లిపురము. అతని తల్లితండ్రులు కొంచెము బీదవారు. విశ్వనాథనాయకునకు శ్రీకృష్ణదేవరాయలుం గారు పాండ్యరాజ్య మిచ్చినపుడు తెలుగుదేశమునుండి విశ్వనాథనాయకులవారితో ననేకమంది సరదారులు మధుర ప్రాంతములకు పోయిరి. వీరభూపతి పూర్వులటుల తెలుగుదేశమునుండి మధురకు పోయిరి. కాని యచటికి పోయినతరువాత విశ్వనాథనాయకుడిచ్చిన భూమి నాధారముచేసికొని వ్యవసాయము చేసికొని జీవించుట మొదలుపెట్టిరి. వీరభూపతి రాజోద్యోగవాంఛచేత రాజవల్లిపురమునుండి మధురకువచ్చి రాజనీతిచదివెను.

మధురలో నాకాలమునందు విద్యావ్యాప్తి చక్కగా నుండెను. మధురలో నా రోజులలో నెప్పుడును పదివేలమంది విద్యార్థులకు తక్కువలేకుండ నుండిరి. ఈ విద్యార్థుల కన్నివసతు లేర్పరుపబడి యుండెను. విద్యార్థుల భోజనాదికములకు, నుపాధ్యాయులకు జీతములకు విజయనగర రాజులును, మధురనాయకులు నిచ్చిన భూము లనేకములున్నవి. ఆ భూములమీద వచ్చు నాదాయము మిగిలిపోవుచుండెను. సంస్కృతము, అరవము, తెలుగు నీ మూడుభాషలు నభ్యసింపబడుచుండెను. దేవాలయములు పాఠశాలలుగా నుపయోగింపబడుచుండెను. సమర్థులైన పండితులు షట్ఛాస్త్రములును, వేదములును విద్యార్థులచేత పఠింపించుచుండిరి. వేఱుపాఠశాలలలో నరవము తెలుగును చెప్పబడుచుండెను. మధురనాయకుల కాలములో తెలుగుభాష మిక్కిలి పోషింపబడెను. రాజకుమారులకు రాజనీతి చెప్పుటకు వేరు పాఠశాలలుండెడివి. అందు ప్రధానమైనది రాజసౌధములోనే యున్నది. సంవత్సరమునకు రెండుసారులు సకల కళాశాలలలోనను విద్యార్థులు పరీక్షింపబడుదురు. పరీక్షయందు తీర్ణులైన వారికి రాజు బిరుదములు, బహుమానములు నిచ్చుచుండును.

రాజనీతితరగతి యనేకభాగములుగా విభజింపబడి యుండెను: గ్రామపాలనము, దాయవిభాగము, శిక్షావిధానము, సైన్యవిభాగము. రాజకుమారులు సైన్యవిభాగ శిక్ష పొందుచుందురు. తక్కినవారు తక్కిన తరగతులలో జదివి తగిన యుద్యోగములు పొందుచుందురు.

మధురనాయకులు వేదరక్షకులు, వర్ణాశ్రమధర్మములను పరిరక్షించినవారు. బ్రాహ్మణులయందు భక్తి దేశమున సంపూర్ణముగా నుండెను. అయినను మధురరాజులు తక్కిన మతములయందు వైషమ్యము కలవారు కాదు. దక్షిణ హిందూస్థానమున ప్రథమమున క్రైస్తవమత మడుగుపెట్టినది మధురరాజుల రాజ్యసీమలోనే.

మధురనాయకులు రాజ్యమును పాళ్య ముపద్ధతిగా విభజించిరి. రాజ్య మనేకమండలములుగా విభజించి ప్రతిమండలము నొక్కొక యధికారిక్రింద నుంచిరి. ఆయధికారి తన మండలమునకు రాజువంటివాడు. అతడు మధుర నాయకునకుకప్పముకట్టుచు తనమండలముమీద తానుసర్వాధికారము చేసికొనవచ్చును. అతడు కొంతసైన్యమును పోషించుచు మధుర నాయకునకవసరము వచ్చినపుడు సహాయము చేయుచుండవలెను. మధురలో మాత్రము రాజు తాను కొందరు మంత్రుల సహాయముతో రాజ్యము చేయుచుండెను.

రాజ్యములో ప్రధానోద్యోగి దళవాయి. అతడే రాజ్యపాలనాధికారియు, సైన్యాధికారియు. పూర్వభారతదేశ పాలకులయందు వలె నీరెండధికారములు నొకటి మంత్రిక్రిందను, నొకటి సేనాపతిక్రిందనునుంచక మధుర రాజులు దళవాయియొక్కనిక్రిందనే యుంచిరి. రాజ్యముయొక్క శాంతి, సాంఘికవ్యవస్థ, ఇతర రాజ్యములతో సంబంధము—నివి దళవాయి చూచెడిపనులు. తక్కిన యంద అధికారుల మీద నితడు పై యధికారి. దళవాయి తరువాతి యధికారి ప్రధాని. ఇతడు రాజ్యాదాయముమీది యధికారి. పన్నులు, తక్కిన రాబడులు, రాజ్యములో నగుచున్న ఖర్చు-నివి యన్నియు నితనిపనులు. దళవాయి యుద్ధకాలములో రాజధానినుండి వెళ్లిపోయినచో నితడు దళవాయి పనులన్నియు చేయుచుండును.

మంత్రులలో మూడవవాడు రాయసము. ఇతడు పరిపాలనలో ప్రధానపురుషుడు. రాజ్యముయొక్క సుస్థితి యీముప్వురిమీద నాధారపడియున్నది. వీరి ముప్వురి తరువాత ప్రధానాధికారులు కణక్కము (గణికుడు)ను, స్థానాపతియును. కణక్కము లెక్కలన్నియు సరిచూచు నధికారి. స్థానాపతి యితర రాజుల కానుకలు, కప్పములు, వానికి సంబంధించిన యన్ని కార్యములు చూచునధికారి.

కొన్ని గ్రామములుకలసి మాగాణమనియు నట్టి కొన్ని మాగాణములు గలసి యొకనాడని యు వ్యవహరింపబడుచుండెను. ఈ నాడునకే దేశము, రాష్ట్రము, రాజ్యము, మండలము నని పేరులు. ప్రతిగ్రామమునకు నధికారులుండిరి. గ్రామములలో న్యాయము గ్రామాధికారులచేతనే తీర్చబడుచుండెడిది. రాజ్యమంతలో నన్నివిధములైన న్యాయములయొక్కయు తీర్పరి ప్రధాని. గ్రామములలో తీర్పు గాబడని యన్ని వ్యాజ్యములును మధురలో తీర్పు చెప్పబడుచుండెను. మధుర యతిసుందరముగా వినిర్మింపబడియుండెను. పట్టణమునకు సరిగామధ్య ప్రదేశమందు మీనాక్షీ సుందరేశ్వరుల దేవళము కట్టబడియుండెను. ఆ దేవాలయము నాలుగువైపుల నాలుగు పెద్ద గోపురములు నిర్మింపబడి యుండెను. ప్రతి దిశయందును నీగోపురమువద్దనుండి యూరి చివరవరకును నొక్కటియేవీథి. శ్రీ మీనాక్షీసుందరేశ్వరుల దేవాలయమునకు చుట్టును చతురస్రముగా

గృహాములు కట్టబడి యున్నవి. పట్టణమం దెచ్చటచూచినను దేవాలయములే. అన్ని దేవాలయములకు నాయకులిచ్చిన మాన్యము లున్నవి. ఏస్వామికిని భోగము లోపములేదు. అన్ని దేవాలయములలోను విద్యార్థులకు వేద శాస్త్రము లుపదేశింపబడు చుండెను. పట్ట ణము సర్వసమృద్ధమై యే విషయమునందు కొఱతబడకుండ నుండెను.

కుట్టాన్ వీరభూపతులు ప్రొద్దు గ్రుంకక ముందే వైగైనదికిపోయి నిన్న కూర్చున్న చోట నే కూర్చుండిరి. కొంచెముచీకటిపడుచుండెను. అస్తమితసూర్యుని యెఱ్ఱకాంతులింకను ధాత్రిని పూర్తిగా వదలిపోలేదు. వైగైనదీపరిక్షిన్న జల తరంగములపైన కొంచెముగా శైత్యమును సేకరించుకున్న వాయువు మందముగా వీచు చుండెను. పలుచగా పారవోలె నిసుకతిన్నెపై ప్రవహించుచున్న వైగైనదినీటిపాయలో చిన్న చేప కదలికకనిపెట్టి పైనుండి తీతువుపిట్ట కూయుచు హఠాత్తుగ గాలిలోనుండి దిగి దానిని కాల పొడుచుకొనిపోయెను. దూరమున పడమటిదిక్కునందు సూర్యభగవానుడు తన రక్తాంశువు లుపసంహరించుకొని కరడుగట్టిన నెత్తురు మన్నువలె తొలగిపోయెనుపో, మెడరు వేచి యొడలినిండ మసిపూసుకొన్న దొంగ వలె సంజచీకటివంగి తొంగిచూచెను. చీకటి లో తళుక్కున మెఱసిన గగనభాగమందలి నక్షత్రములు వైగై పలుచని నీటిపొరలో ప్రతి ఫలించి లోని వెండిమేను మీనుల యండముల క్రామేడితములు గల్పించెను. సన్నని నీటిపా యలలోని ఓలు కెరటములు త్రాచుపాము పిల్లలవలె నోడ్డునకు కొట్టకొనుచు వచ్చు చుండెను...... (సశేషము)

మా వ్యాసకర్తలకు

వ్యాసములు చిన్నసైజు కాగితములపై ఒకవైపున మాత్రమే విడిఅక్షరములతో బంతులు దూరదూరముగా, దిద్దుబాట్లు లేకుండ, తిన్నగా వ్రాసి వర్ణక్రమమునను తప్పులు లేకుండ చూచుకొని పంప వేడికోలు. లేకున్న ముద్రణకార్యములయందు మిగుల కష్టము కలుగుటయే కాక తప్పులుకూడ నిలిచిపోవునని మనవి.

సంపాదకుడు: 'భారతి'